సాక్షి రంగారెడ్డి

మంగళవారం ¸ 3 ¸ జూన్ ¸ 2025



నాలాలపై నజర్

వర్షాకాలం నేపథ్యంలో హైడ్రా నాలాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ మేరకు ప్రజల నుంచి సమాచారం కోరింది. 10లో▸



విజయవంతం చేయాలి

ప్రభుత్వం నిర్ణయించిన వంద రోజుల ప్రణాళికను జయప్రదం చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సూచించారు. 10లో▸



యువతతోనే వికసిత భారత్

యువతరమే వికసిత భారతానికి బాటలు వేయగలదని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



తనిఖీ శిబిరాన్ని పరిశీలిస్తున్న సీపీ సుధీర్ బాబు

మంచాల: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు అన్నారు. మండల పరిధిలోని ఆగాపల్లిలో నాగార్జునసాగర్– హైదరాబాద్ రోడ్డుపై మంచాల పోలీసులు ఏర్పాటు చేసిన వాహన తనిఖీ శిబిరాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అక్రమ రవాణా, నేరాలను అరికట్టడంలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 7న బక్రీద్‌ను దృష్టిలో పెట్టుకొని ఆవుల అక్రమ రవాణా నివారణ కోసం చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ రాజు, మంచాల సీఐ మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని కాపాడుకుందాం

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్



ప్రచార జాతలో పాల్గొన్న నాయకులు

కడ్తాల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచి విద్యారంగాన్ని కాపాడుకుందామని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మండల పరిధిలోని అన్మాస్‌పల్లిలో సోమవారం ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ హితం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. అన్ని రకాల మౌలిక వసతులతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారన్నారు. మన ఊరి బడిలో మన పిల్లలను చేర్పించి, మన బడిని మనమే కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్, మండల అధ్యక్షుడు జంగయ్య, మాజీ సర్పంచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'బెస్ట్ ప్రాక్టీస్'కు వెంకమ్మగూడ పాఠశాల హెచ్‌ఎం ఎంపిక



సింహాద్రినాయుడు

షాబాద్: హైదరాబాద్‌లోని రాష్ట్రస్థాయి విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధిలో వివిధ అభ్యసన పద్ధతులపై (బెస్ట్ ప్రాక్టీస్) నిర్వహించే ఉత్తమ ప్రదర్శనకు మండలంలోని వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సింహాద్రినాయుడు ఎంపికయ్యారు. ఈ మేరకు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి నూతన అభ్యసన ప్రక్రియ ప్రదర్శనలకు సంబంధించి జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రదర్శనకు ఎంపికైన వాటిని రాష్ట్రస్థాయికి పంపించాలని ప్రభుత్వం జిల్లా విద్యాశాఖను ఆదేశించిందని తెలిపారు.

నిరంతరాయ విద్యుత్ సరఫరాకు కొత్త సబ్‌స్టేషన్



సబ్‌స్టేషన్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఈ లక్ష్మీనారాయణ తదితరులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చు తగ్గుల నియంత్రణ, నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం కొంగరకలాన్‌లోని కలెక్టరేట్ భవన ఆవరణలో కొత్తగా 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మించనున్నట్లు సరూర్‌నగర్ ఎస్‌ఈ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన సబ్‌స్టేషన్ కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. సాధ్యమైనంత త్వరలో పనులు పూర్తి చేసి, సరఫరాను మెరుగుపర్చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం డీఈ, ఏడీఈ, ఏఈ, ఇతర ఇంజనీర్లు ఉన్నారు.





చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

అభివృద్ధే ధ్యేయం

పారదర్శకంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు

- అధికారులు అంకితభావంతో పని చేయాలి
- నీతి, నిజాయితీ, నిక్కచ్చిగా వ్యవహరించాలి
- జిల్లా అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలి
- రాష్ట్ర అవతరణ వేడుకల్లో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'జిల్లా అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలి. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా, పారదర్శకంగా అమలు చేయాలి. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురాకుండా చూడటంతో పాటు ఉద్యోగులు విధి నిర్వహణలో నీతి, నిజాయితీతో నిక్కచ్చిగా వ్యవహరించాలి' అని ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన తర్వాత జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరుల కుటుంబ సభ్యులను సన్మానించారు. అనంతరం జిల్లా ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

పథకాలతో ఎంతో చేశాం

ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించింది. భవిష్యత్తు తెలంగాణకు ఇదో భగవద్గీత. దీనిలో భాగంగానే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాం. ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో జిల్లాలో ఇప్పటి వరకు రూ.1,314 కోట్ల జీరో వడ్డీ రుణాలను పంపిణీ చేశాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. రూ.500కే వంటగ్యాస్ పథకం ద్వారా జిల్లాలో 2,10,276 కుటుంబాలకు లబ్ధి చేకూర్చాం. గృహజ్యోతి పథకం ద్వారా రూ.12.7 కోట్ల సబ్సిడీని మంజూరు చేశాం. 17,440 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. రుణమాఫీ పథకంలో భాగంగా 1,00,268 మంది రైతులకు సంబంధించి రూ.769.54 కోట్లు మాఫీ చేశాం. పెట్టుబడి సాయం కింద 2,19,418 మంది రైతుల ఖాతాల్లో రూ.180.92 కోట్లు జమ చేశాం. ధాన్యం కొనుగోలులో భాగంగా యాసంగిలో 18,112 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి, రూ.37.21 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశాం. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 10,339 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి వారి ఖాతాల్లో మొదటి విడతగా రూ.6.24 కోట్లు జమ చేశాం. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తేవాలని భావించి ఇప్పటికే షాద్‌నగర్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టాం.

ఫ్యూచర్‌సిటీ తలమానికం

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో మరో అద్భుతనగరానికి శ్రీకారం చుట్టాం. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్‌సిటీ ఏర్పాటు చేస్తున్నాం. ఏఐ సిటీ, ఫార్మాసిటీ, స్పోర్ట్స్ సిటీ, లైఫ్ సైన్సెస్, హెల్త్ సిటీలను ఏర్పాటు చేస్తున్నాం. అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా 'ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ' ఏర్పాటు చేశాం. అమెరికా, దక్షిణ కొరియా, సింగపూర్, దావోస్, జపాన్ దేశాల్లో పర్యటించి భారీగా పెట్టుబడులు సాధించాం. ఏఐ గ్లోబల్ సమ్మిట్, బయో ఏసియా సదస్సు, ప్రపంచ సుందరి పోటీలను విజయవంతంగా నిర్వహించి జిల్లాను విశ్వవేదికపై నిలిపాం. వివిధ రుగ్మతలతో బాధపడుతున్న 61,245 మంది పేదలకు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచిత చికిత్సలు అందించాం. ఇందుకోసం రూ.151.21 కోట్లు ఖర్చు చేశాం. భూ హక్కుల రికార్డులను పక్కగా నిర్వహించేందుకు, భూ యజమానులకు భరోసా కల్పించేందుకు, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు భూ భారతి–2025 చట్టాన్ని తీసుకొచ్చాం. జిల్లాలోని కొందుర్గు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. రైతుల నుంచి 573 అర్జీలు రాగా, 464 అర్జీలను ఆమోదించాం. మంగళవారం నుంచి అన్ని మండలాల్లో భూభారతి అమల్లోకి వస్తుంది. భూ సమస్యలు లేకుండా పరిష్కరించుకోవాలి. జిల్లా అభివృద్ధి కోసం అధికారులంతా అంకిత భావంతో పని చేయాలి.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్ రెడ్డి

ఆకట్టుకున్న చిన్నారుల కళారూపాలు

వేడుకలను పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన కళారూపాలను ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శేరిలింగంపల్లి నాగార్జున ఉన్నత పాఠశాల విద్యార్థులు 'జయజయహే తెలంగాణ' గీతానికి ప్రదర్శించిన నృత్యరూపకం మనసును కట్టిపడేసింది. కడ్తాల్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు దేశ సరిహద్దుల్లో ఆర్మీజవాన్లు చేస్తున్న పోరాటాన్ని తమ నృత్యరూపకంలో కళ్లకు కట్టారు. సరూర్‌నగర్ పల్లవి స్కూలు విద్యార్థులు 'టంగుటుయ్యాల్లో..' అంటూ ప్రదర్శించిన నృత్యరూపకం, తుక్కుగూడ జెడ్పీ స్కూలు విద్యార్థినులు ప్రదర్శించిన బంజారా నృత్యరూపకం, తలకొండపల్లి కేజీబీవీ విద్యార్థులు ప్రదర్శించిన బతుకమ్మ ఆట, ఆమనగల్లు కేజీబీవీ విద్యార్థునులు ప్రదర్శించిన బోనాలు, పోతరాజు విన్యాసాలు, శివసత్తుల పూనకాలు అలరించాయి. కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, ఆరోపణలకు ఆస్కారం ఇవ్వొద్దు

- ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకూడదు
- నేటి నుంచి 20 వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు
- అధికారులతో కలెక్టర్ నారాయణరెడ్డి టెలీకాన్ఫరెన్స్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'భూ సమస్యల పరిష్కారంలో ఎలాంటి అవినీతి, ఆరోపణలకు ఆస్కారం ఇవ్వొద్దు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దు. పారదర్శకంగా, నిజాయితీగా, నిక్కచ్చిగా వ్యవహరించాలి. రెవెన్యూ యంత్రాంగంపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలి. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించి, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చే వాళ్లు ఎంతటి వారైనా ఉపేక్షించబోను. వారిపై కఠినంగా వ్యవహరించేందుకు వెనుకాడను' అని కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరించారు. భూభారతి చట్టం–2025 అమల్లో భాగంగా మంగళవారం నుంచి 20వ తేదీ వరకు గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ అంశంపై సోమవారం ఆర్డీఓలు, తహసీల్దార్లు, నయాబ్ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతుల నుంచి అర్జీల స్వీకరణ మొదలు క్షేత్రస్థాయి విచారణ పూర్తి నిబద్ధతతో జరగాలని సూచించారు. అవకతవకలకు అవకాశం కల్పిస్తే ప్రభుత్వానికి మాత్రమే కాదు మొత్తం రెవెన్యూ శాఖకే చెడ్డపేరు వస్తుందని, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది అంకిత భావంతో పని చేసి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని సూచించారు. భూభారతి చట్టంలో అప్పీల్ వ్యవస్థను అమలు చేస్తున్నందున ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణయం తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ ప్రక్రియ నిర్వహించే క్రమంలో ప్రతి ఒక్కరూ సంయమనంతో వ్యవహ రించాలని, సాదాబైనామాలు, పీఓటీ దరఖాస్తులకు సంబంధించిన రికార్డుల పరిశీలన, అమలు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు చేయాలని సూచించారు. ప్రభుత్వ, అసైన్డ్ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదేనన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తెచ్చిన భూ భారతి చట్టం కింద భూ సంబంధిత సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, వాటికి శాశ్వత పరిష్కార మార్గం చూపాల్సిన బాధ్యత మనదేనని గుర్తు చేశారు. ఇప్పటికే కొందుర్గు మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ఈ పని నిర్వహించడం జరిగిందని, ఇదే తరహాలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో నిర్వహించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు కొనసాగాలని సూచించారు. సదస్సు నిర్వహించేందుకు రెండు మూడు రోజుల ముందే ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు రాయితీ కల్పించండి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యా సంస్థల్లో యాభైశాతం ఫీజు రాయితీ కల్పించాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. ఈమేరకు సోమవారం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మైల సైదులు ఆధ్వర్యంలో కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసింది. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని ప్రైవేటు పాఠశాలల్లోనూ జర్నలిస్టుల పిల్లల ఫీజులో 50 శాతం రాయితీ అమలయ్యేలా చూస్తానని, ఆయా స్కూళ్లకు సర్క్యులర్ జారీ చేస్తామని స్పష్టం చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సీనియర్ జర్నలిస్టులు శేరిబాయి గణేశ్, సురేష్, శ్రీనివాసచారి తదితరులు ఉన్నారు.

స్లాట్ బుకింగ్ షురూ

- ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అమలు
- 31 స్లాట్ బుకింగ్స్, 26 రిజిస్ట్రేషన్లు
- ఎనిమిది నిమిషాలలోపు ప్రక్రియ పూర్తి

ఇబ్రహీంపట్నం: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం స్లాట్ బుకింగ్ విధానం ద్వారా ఆస్తుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అమలులోకి వచ్చింది. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ స్లాట్ బుకింగ్ విధానాన్ని ఏప్రిల్ 10న ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మొదలుపెట్టిన విషయం తెలిసిందే. అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. తొలిరోజు ఇబ్రహీంపట్నంరిజిస్ట్రేషన్ కార్యాలయంలో 31 స్లాట్ బుకింగ్స్ కాగా 26 రిజిస్ట్రేషన్లు జరిగాయి. కేవలం 8 నిమిషాల్లో ఈ ప్ర క్రియ పూర్తి కావడం విశేషం. డిప్యూటేషన్‌పై హనుమంతురావును అదనపు సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు.

తొలి డాక్యుమెంట్

ఆదిబట్ల మున్సిపాలిటీ మంగల్‌పల్లి రెవెన్యూ పరిధిలో ఎం. పారిజాతకు సంబంధించిన 200 గజాల స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ స్లాట్ విధానంతో జరిగింది. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్లు సోని, హనుమంతురావు ఆమెకు తొలి డాక్యుమెంట్ ప్రతిని అందించారు.



తొలి రిజిస్ట్రేషన్ ప్రతిని పారిజాతకు అందిస్తున్న సబ్ రిజిస్ట్రార్లు సోని, హనుమంతురావు

ఘనంగా 'సెల్యూట్ టు సోల్జర్స్'



మాజీ సైనికాధికారులకు సత్కారం

చైతన్యపురి: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నుంచి ప్రేరణ పొందిన ప్రజలు భిన్న రూపాల్లో దేశ భక్తిని చాటుకున్నారని రిటైర్డ్ కలెక్టర్ ఎంవీ రెడ్డి అన్నారు. కోదాడ ఆత్మీయ ప్రవాస సమితి, అపోలో మెడికల్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో 'సెల్యూట్ టు సోల్జర్స్' పేరిట చైతన్యపురిలోని అపోలో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బుర్రి రామయ్యతో కలిసి పాల్గొన్నారు. సంగోజు నాగాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్మీ అధికారులు పలువురు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం పోరాడుతున్న త్రివిధ దళాల అధికారులు, సైనికుల సేవలను గుర్తు తెచ్చుకోవాలన్నారు. రిటైర్డ్ కల్నల్ సుంకర శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి యువత ఆర్మీలో చేరేందుకు అవగాహన కల్పించాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న మేజర్ టి.సాయి భార్గవ్ తన అనుభవాలను వివరించారు. ఈసందర్భంగా మాజీ ఆర్మీ అధికారులు కల్నల్ స్వర్ణారెడ్డి, సుబేదార్ మేజర్ పీఎస్‌ఎన్ స్వామి, సార్జెంట్ జి.నర్సింహారెడ్డి, రామనాథం, వనం సుదర్శన్, దయా కర్‌రెడ్డి, సుబేదారు ఎస్.నర్సయ్యను ఘనంగా సత్కరించి.. వారు చేసిన సేవలను కొని యాడారు. అనంతరం పహల్గాం మృతులు, పాకిస్తాన్ దాడుల్లో వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు.

నీటితో కాసుల వేట!

- గ్రేటర్‌లో యథేచ్ఛగా అక్రమ వ్యాపారం
- అధికారుల కళ్లకు కనిపించని దందా
- ప్రైవేట్ స్థలాల్లో బోర్లు వేసి భారీ స్థాయిలో
- మూసీ తీరం నుంచీ పెద్దఎత్తున విక్రయం
- వాల్టా చట్టానికి అడుగడుగునా తూట్లు



సాక్షి, సిటీబ్యూరో: నగరంతో పాటు మూసీ తీరం వెంట అక్రమ నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా భారీగా బోర్లు వేస్తున్న కొందరు ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తున్నారు. వాటర్–ల్యాండ్–ట్రీ యాక్ట్‌ను (వాల్టా చట్టం) అడ్డంగా ఉల్లంఘిస్తున్నా...ఒక్క రూపాయి పన్ను చెల్లించకుండా నిత్యం రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నా సంబంధిత విభాగాలు పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. అక్రమ నీటి వ్యాపారం ఫలితంగా అనేక కాలనీల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్నాయి.

పట్టుమని పది సంస్థలూ లేవు

గృహావసరాల కోసం బోరు వేయాలన్నా కచ్చితంగా స్థానిక తహసీల్దార్ నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. ఇలా వేసిన బోరు నీటిని గృహ, వ్యక్తిగత అవసరాలకు మాత్రమే వినియోగించాలి. ఒక్క ట్యాంకర్ కూడా విక్రయించడానికి ఆస్కారం లేదు. ప్లాంట్ ఏర్పాటు చేసి, అనుమతి పొందితే శుద్ధి చేసిన తాగు నీరు విక్రయించవచ్చు. ట్యాంకర్ల ద్వారా నీటిని అమ్మాలంటే కచ్చితంగా భూగర్భ జల శాఖ వద్ద అనుమతి తీసుకోవాలి. ఇలా అనుమతి తీసుకున్న వ్యక్తులు, సంస్థలు కనీసం పది కూడా లేకపోవడం గమనార్హం. భూగర్భ జలాలు పరిమితంగా ఉన్న చోట ఇలా బోర్ల ద్వారా విక్రయానికి అనుమతి లభించదు. ప్రస్తుతం నగరంలో మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండా వందల అడుగుల బోర్లు వేసి ఆ నీటిని విక్రయిస్తున్న వాళ్లు పదుల సంఖ్యలో ఉన్నారు.

పగటి కంటే రాత్రివేళ ఎక్కువగా..

సాధారణ రోజుల్లో అక్రమ నీటిదందా పగటి వేళలో కంటే రాత్రి వేళల్లోనే ఎక్కువగా జరుగుతుంది. వేసవి వచ్చిందంటే చాలు అక్రమ వ్యాపారులు ట్యాంకర్ల ద్వారా 24 గంటలూ నీటిని తరలిస్తూనే ఉంటున్నారు. భారీ పరిమాణంలో బోర్లు వేసిన అక్రమార్కులు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జనరేటర్లు వినియోగించి మరీ నీటిని తోడేస్తున్నారు. కనీసం ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించకుండా రూ.లక్షల్లో వ్యాపారం చేసేస్తున్నారు. ఒక్కో ట్యాంకర్‌ను దాని పరిమాణాన్ని బట్టి రూ.1,000 నుంచి రూ.3,000 వరకు విక్రయిస్తున్నారు.

వినియోగం ఎంత శ్రేయస్కరం...?

ఈ అక్రమ నీటి వ్యాపారం వెనుక ఆరోగ్యానికి చేటు కలిగించే కోణమూ ఉందని తెలుస్తోంది. ట్యాంకర్లలో నీటిని నింపే బోర్లలో కొన్ని మూసీ తీరంలో ఉన్నాయి. ఫలితంగా వీటి నుంచి వచ్చే నీళ్లల్లో మూసీలోని రసాయన వ్యర్థాలకు సంబంధించిన ఆనవాళ్లు ఉంటున్నాయని తెలుస్తోంది. ఈ నీటిని తాగడానికి వాడకపోయినా ఇతర అవసరాలకు వాడేస్తున్నారు. వేసవి కాలంలో ఉండే నీటి డిమాండ్‌ను బోర్ల నిర్వాహకులు క్యాష్ చేసుకుంటున్నారు.

పట్టించుకోని సంబంధిత విభాగాలు

అక్రమ నీటి దందాలను అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడట్లేదనే విమర్శలు ఉన్నాయి. ఇకనైనా స్పందించి నీటి అక్రమ వ్యాపారాన్ని అడ్డుకోవాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పర్యావరణవేత్తలు కోరుతున్నారు.


శిక్షణార్థులతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

నైపుణ్యం కలిగిన యువతతోనే వికసిత భారత్

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- భూభారతి చట్టంతో సమస్యలు తొలగాలని ఆకాంక్ష

శంషాబాద్ రూరల్: దేశాభివృద్ధిలో తమ భాగస్వామ్యం ఏమిటో ప్రతి పౌరుడు ఆత్మ విమర్శ చేసుకోవాలి.. నైపుణ్యం కల్గిన యువతరమే వికసిత భారతానికి బాటలు వేయగలదని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో సోమవారం శిక్షణార్థులతో ఆయన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ట్రస్టు శిక్షణార్థులు, భూభరతి లైసెన్స్డ్ సర్వేయర్ల శిక్షణార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు, మహిళలు, యువత అభివృద్ధిపై స్వర్ణ భారత్ ట్రస్టు ప్రధాన దృష్టి పెట్టిందన్నారు. ఒక పూట అన్నం పెట్టడం కాకుండా.. స్వశక్తితో రోజూ ఆహారాన్ని సమకూర్చుకునేలా నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. నిత్య జీవితంలో యోగా, ధ్యానం, ఆరోగ్యకర ఆహారాన్ని జీవన విధానంగా చేసుకోవాలని సూచించారు.

వందరోజుల ప్రణాళిక విజయవంతం చేయాలి

- శంషాబాద్‌ను స్వచ్ఛమైన పట్టణంగా మార్చుకోవాలి
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్: శంషాబాద్‌ను స్వచ్ఛమైన.. పరిశుభ్రమైన పట్టణంగా మార్చుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించిన వంద రోజుల ప్రణాళికను విజయవంతం చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సూచించారు. శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు అధ్యక్షతన మండలి భవనంలో ఏర్పాటు చేసిన ప్రతిజ్ఞా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. వంద రోజుల ప్రణాళికలో పరిశుభ్రత చర్యలు, పచ్చదనం, కాలుష్య నివారణ, ప్లాస్టిక్ నిషేధం వంటి ఎన్నో మంచి కార్యక్రమాలు ఉన్నాయన్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రజలందరు భాగస్వాములై ఈ కార్యక్రమాన్ని విజయవతం చేయాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు అన్ని పథకాలను అందజేస్తుందన్నారు. పర్యావరణ హితంగా వ్యవహరించిన వాటర్‌మెన్ నాగేష్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. మున్సిపల్ మేనేజర్ శ్రావణి, మాజీ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ మాజీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు సంజయ్‌యాదవ్, వై.కుమార్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి మైలారం సులోచన, స్థానిక నేతలు తోకల మురళి పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రైతులకు వరి విత్తనాల కిట్‌ల పంపిణీ

శంషాబాద్ రూరల్: 'గ్రామ గ్రామానికి వ్యవసాయ విశ్వ విద్యాలయం నాణ్యమైన విత్తన పంపిణీ' కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని రైతులకు ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ విత్తనాల కిట్‌లను అందజేశారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద కేఎన్ఎం 1638 వరి రకం విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. రైతులు నాణ్యమైన విత్తనాల సాగుతో అధిక దిగుబడి పొందవచ్చని ఎమ్మెల్యే సూచించారు. రైతులు పండించిన తర్వాత వీటిని గ్రామాల్లోని మిగతా రైతులకు విత్తనం కోసం ఇవ్వాలన్నారు. మండలంలోని 19 గ్రామాలకు ముగ్గురు రైతుల చొప్పున వరి విత్తనాల కిట్లను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయధికారి శ్వేత తెలిపారు. ఒక్కో రైతుకు పది కిలోల వరి విత్తనాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ఏడీ కవిత, తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతదేహం వెలికితీత

ఇబ్రహీంపట్నం: స్థానిక పెద్ద చెరువులో పడిన మహిళ మృతదేహాన్ని సోమవారం వెలికితీశారు. నగరంలోని ఫలక్‌నుమాకు చెందిన రేష్మా(24) ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు ఇబ్రహీంపట్నం చెరువులో మునిగిపోయిన సంగతి తెలిసిందే. బాలపూర్‌కు చెందిన ఖాసింతో కలిసి ఆమె ఇబ్రహీంపట్నంకు వచ్చింది. పెద్ద చెరువులో ఖాసిం ఈత కొడుతుండగా రేష్మా కూడా చెరువులోకి దిగిడంతో ప్రమాదం సంభవించింది. సోమవారం ఉదయం ప్రత్యేక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టడంతో మృతదేహం లభ్యమయింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అర్చనకు గ్రామీణ్ ప్రగతి స్కాలర్‌షిప్

ఆరేళ్ల పాటు రూ.లక్ష చొప్పున ఉపకార వేతనం



కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డి గూడ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని కుక్కల అర్చన పదోతరగతిలో 546 మార్కులు సాధించినందుకు గాను గ్రామీణ్ ప్రగతి ఉపకార వేతనానికి ఎంపిక చేశారు. ఫరూఖ్‌నగర్ పరిధి బూర్గుల శివారులో ఉన్న ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతీ ఏడాదికి రూ.లక్ష చొప్పున ఆరేళ్ల పాటు ఉపకార వేతనం అందించనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ చంద్రశేఖర్, పాఠశాల హెచ్ఎం శ్రీశైలం, సీఆర్పీ మల్లేశ్ విద్యార్థినిని అభినందించారు.

కేజీబీవీలో పనిచేసేందుకు దరఖాస్తుల ఆహ్వానం

కొందుర్గు: కొందుర్గు కేజీబీవిలో పనిచేయటకు ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేకాధికారి షెకీనా నిస్సీ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వంట పనివారు, నైట్‌వాచ్ ఉమెన్, డే వాచ్ ఉమెన్, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. వంటపని, డే మరియు నైట్ వాచ్ ఉమెన్‌లకు 10వ తరగతి, అటెండర్‌కు ఇంటర్ అర్హత ఉండాలన్నారు. పై పోస్టులకు మండల పరిధిలోని మహిళలు మాత్రమే ఈ నెల 8వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 86861 58456 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కారు బోల్తా.. డ్రైవర్ మృతి

షాబాద్: కారు అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్ మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన షాబాద్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. కొందుర్గు మండలం చిన్న ఉమ్మెంతాలకు చెందిన ఇసంతపురం శ్రీకాంత్(28) కొందుర్గులో ఓ వ్యక్తి వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 1న విధుల్లో భాగంగా కారులో షాబాద్‌కు వచ్చాడు. తన స్నేహితుడు మహేశ్‌తో కలిసి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో మరియాపురం శివారులో కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కాలు విరగడంతో పాటు చేతికి బలమైన గాయాలయ్యాయి. మహేశ్ తలకు గాయమైంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో షాద్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు డ్రైవర్ శ్రీకాంత్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మహేశ్‌ను మెరుగైన వైద్యం కోసం షాద్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సోమవారం మృతుడి భార్య అనూష పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో

గురుకుల బాలికల సత్తా


ఆర్.గీతిక(905)


ఎం.నందు(1,956)


టి.అక్షయ(5,761)


జి.అనూష(2,504)


పి.రమ్యశ్రీ(5,416)


దీపన్విత (1,248)

ఇబ్రహీంపట్నం: నల్లకంచె ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల విద్యార్థినులు జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో సత్తాచాటారు. సోమవారం వెల్లడించిన ఫలితాల్లో గీతిక 905, నందు 1,956, అక్షయ 5,761, అనూష 2,504, రమ్యశ్రీ 5,416వ ర్యాంక్ సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది విద్యార్థినులను అభినందించారు.

మెరిసిన గిరిజన తేజం

కేశంపేట: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో మండల పరిధిలోని దేవునిగుడితండాకు చెందిన గిరిజన విద్యార్థిని వి.దీపన్విత ఆల్ ఇండియా 1,248వ ర్యాంక్ సాధించింది. తండాకు చెందిన బాలు నాయక్ తన భార్యతో కలిసి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి కుమారుడు, కుతూరు ఉన్నారు. కుతూరు దీపన్విత 1వ తరగతిని తండాలోనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదివింది. అనంతరం 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు షాద్‌నగర్ ఇంగ్లిష్ మీడియం పబ్లిక్ స్కూల్‌లో చదివింది. అనంతరం ఇంటర్మీడియట్‌ను హైదరాబాద్‌లోని అల్మాస్‌గూడలో ఉన్న సంకల్ప్ జూనియర్ కళాశాలలో ఎంపీసీ పూర్తి చేసింది. ఇంటర్మీడియట్‌లో 734 మార్కులను సాధించిన దీపన్విత జేఈఈలో (హాల్‌టికెట్ నంబర్ 256125077) ఉత్తమ ర్యాంకు సాధించడంతో కుటుంబ సభ్యులతో పాటు తండావాసులతో అభినందించారు. ఉన్నత చదువులకు దాతలు సహకరించాలని తండ్రి కోరాడు.

గిరిపుత్రుడికి 590 ర్యాంకు

షాద్‌నగర్: జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో గిరి పుత్రుడు సత్తాచాటాడు. ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లి పంచాయతీ దేవునిబండతండాకు చెందిన పాత్లావత్ జగన్, విజయ దంపతుల కుమారుడు సాయికిరణ్ జాతీయ స్థాయిలో 590 ర్యాంకు సాధించాడు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే



మాది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతోనే మంచి ర్యాంకు సాధించగలిగా. సమయం వృథా చేయకుండా చదివా. భవిష్యత్తులో ఉన్నత స్థితికి ఎదగాలనేదే నా ఆకాంక్ష.

– సాయికిరణ్

పరిగి విద్యార్థికి రాష్ట్రస్థాయి 136వ ర్యాంకు

పరిగి: జేఈఈ అడ్వా న్స్‌డ్ ఫలితాల్లో పరిగి విద్యార్థి సత్తా చాటా డు. పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన కనకం ప్రణవ్‌తేజ్ 360 గాను 272 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి 136వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు.


ప్రణవ్‌తేజ్

నాలాలపై నజర్

- వర్షాకాలం నేపథ్యంలో దృష్టి పెట్టిన హైడ్రా
- తమ దృష్టికి తేవాలంటూ ప్రజలకు విజ్ఞప్తి
- సోమవారం ప్రజావాణిలో 23 ఫిర్యాదులు

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలో చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాలే కాదు నాలాలూ మాయమయ్యాయి. వర్షాకాలం నేపథ్యంలో దీనిపై దృష్టి పెట్టిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ప్రజల నుంచి సమాచారం కోరింది. దీనికి అనూహ్య స్పందన వచ్చిందని అధికారులు చెబుతున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నాలాల కబ్జాలకు సంబంధించి 23 ఫిర్యాదులు అందాయని, మొత్తం ఫిర్యాదుల్లో ఇవి 70 శాతం వరకు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం నాలాల కబ్జాల ఫిర్యాదులపై ఎక్కువగా దృష్టి పెడుతున్నాయని అధికారులు స్పష్టం చేశారు. మరోపక్క రాష్ట్ర అవతరణ దినోత్సవం నేపథ్యంలో సోమవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హైడ్రా పోలీస్ స్టేషన్ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు.

– తిరుమలగిరి భూదేవినగర్‌లోని సాయిదత్తా గార్డెన్స్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఉద్దేశించిన 225 గజాల స్థలం కబ్జాకు గురైందని స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 2004లోనే జీహెచ్ఎంసీకి ఆ స్థలాన్ని ఇచ్చి కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరినా ఫలితం లేదని వాపోయారు.

- శేరిలింగంపల్లి మండలంలోని ఖానామెట్‌లో సర్వే నెం.11/20, 11/21ల్లో గురుకుల ట్రస్టు లేఔట్‌ను 1983లో వేశారు. అందులోని ప్లాట్లతో పాటు రహదారులు కబ్జాకు గురయ్యాయని స్థానికులు ఫిర్యాదు చేశారు.
- బేగంపేటలోని చికోటి గార్డెన్స్ ప్రాంతంలో నాలా కుంచించుకుపోవడంతో బృందావన్ అపార్టుమెంట్‌లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. 2020లో వరదలకు దీని సెల్లార్ నీట మునిగింది. ఇక్కడి వారికి ప్రతి వర్షాకాలం ఇబ్బందికరంగా పరిణమిస్తోంది.
- కూకట్‌పల్లిలోని రంగధాముని చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణలతోపాటు ఈ చెరువు నుంచి ఐడీఎల్ చెరువుకు వెళ్లే నాలా కూడా కబ్జా జరిగిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో భారీ వర్షాలు కురిసినప్పుడు ఏడు కాలనీలకు వరద ముప్పు ఉంటోందని వాపోయారు. వెంటనే ఆక్రమణలను తొలగించి వరద నీరు సాఫీగా వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని కోరారు.
- హస్మత్‌పేట నాలా, పికెట్ నాలాలు కుంచించుకుపోవడంతో బేగంపేట పరిసరాల్లోని పైగా కాలనీ, విమాన్ నగర్, బీహెచ్ఈఎల్ కాలనీ, అవంతి కాలనీ, రసూల్‌పుర బస్తీ వరద నీటిలో చిక్కుకుంటున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు.
- సైదాబాద్, బాలాజీ నగర్‌లో మురుగు, వరద కాలువలు కబ్జాకు గురయ్యాయని బాలాజీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఒవైసీ ఆసుపత్రి వద్ద చెరువు నిండితే ఆ వరద ఆదర్శ్‌నగర్ మీదుగా సరూర్‌నగర్ చెరువుకు చేరాలి. అయితే వరద కాలువ కుంచించుకుపోవడంతో బస్తీలు నీట మునుగుతున్నాయని వారు పేర్కొన్నారు.


హైడ్రా ఠాణా వద్ద జెండా ఆవిష్కరిస్తున్న రంగనాథ్

ఒకే దేశం.. ఒకే ఎన్నిక

- జీజేపీ నినాదం
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పరిగి: దేశంలో నిత్యం ఎన్నికలు జరగడం ద్వారా అభివృద్ధి కుంటు పడుతోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం పరిగి పట్టణంలో ఒకే నేషన్.. వన్ ఎలక్షన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా ఒకే సారి ఎన్నికలు నిర్వహిస్తే వేల కోట్ల రూపాయల ఖర్చు తగ్గుతుందన్నారు. ప్రతి మూడు, నాలుగు నెలలకు ఎన్నికలు నిర్వహించడం ద్వారా కోడ్ అమల్లోకి వచ్చి అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. వీటన్నంటినీ దృష్టిలో ఉంచుకునే ఒకే సారి ఎన్నికలకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. గడిచిన పదేళ్లలో దేశం ఎంతో పురోగతి సాధించిందని పేర్కొన్నారు. ఇది ప్రధాని మోదీతోనే సాధ్య మైందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అలాగే అర్హులైన వారికి పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మరోసారి వీరరాఘవరెడ్డి అరెస్టు

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడైన వీరరాఘవరెడ్డిని మొయినాబాద్ పోలీసులు సోమవారం మరోసారి అరెస్టు చేశారు. కండిషన్ బెయిల్‌పై బయటకు వచ్చిన వీరరాఘవరెడ్డి మే 1న మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సంతకం చేసి వెళ్తూ అజీజ్‌నగర్ చౌరస్తా సమీపంలో టీ తాగడానికి ఆగిన సమయంలో చిలుకూరు గ్రామస్తులతో గొడవ జరిగింది. పరస్పరం దాడులు చేసుకోవడంతో చిలుకూరుకు చెందిన రాజు అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో వీరరాఘవరెడ్డికి సైతం స్వల్ప గాయాలయ్యాయి. ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మే 1న జరిగిన గొడవకు సంబంధించిన కేసులో సోమవారం వీరరాఘవరెడ్డిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో వర్గంలో చిలుకూరుకు చెందిన 12 మంది యువకులకు 41 నోటీసులు ఇచ్చి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు.

అదృశ్యమైన యువకుడు.. శవమై తేలాడు

చేవెళ్ల: అదృశ్యమైన యువకుడు శవమై తేలాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన గాదె రఘు(26) ఆర్టీసీ కార్గోలో డైలీ కూలిగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం పనికి వెళ్తున్నట్లు చెప్పి రాత్రి అయినా తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం ఆయన సోదరి రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో చేవెళ్ల వేంకటేశ్వర స్వామి ఆలయం పక్కన ఉన్న గుండంలో మధ్యాహ్నం ఓ మృతదేహం నీటిపై తేలియాడుతున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు శవాన్ని బయటకు తీసి పరిశీలించి మృతుడు తప్పిపోయిన గాదె రఘుగా గుర్తించారు. చేవెళ్ల ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి బలవన్మరణం

కుల్కచర్ల: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ ఉరేసుకుని మృతిచెందాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన ప్రకారం.. ఇప్పాయిపల్లికి చెందిన ఆంజనేయులు (26) తల్లిదండ్రులు మందలించారని మనస్తాపంతో శనివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు, బంధువులను ఆరా తీసినా ఫలితం కనిపించలేదు. దీంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో సోమవారం ఇప్పాయిపల్లి చెరువుకట్ట సమీపంలో ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకున్నాడని పోలీసులకు సమాచారం అందింది. వారు వెళ్లి పరిశీలించి మృతుడు ఆంజనేయులుగా గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కారు దగ్ధం

గచ్చిబౌలి: రోడ్డుపై వెళుతున్న కారు దగ్ధమైన సంఘటన సోమవారం గచ్చిబౌలి ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన ప్రకారం.. సోమవారం రాత్రి టయోటా క్యామ్రిన్ హైబ్రీడ్ కారు బయోడైవర్సిటీ వైపు నుంచి గచ్చిబౌలికి వెళుతోంది. సైబరాబాద్ కమిషనరేట్ సమీపంలోకి రాగానే కారు ఇంజిన్‌లోనుంచి పొగ రావడాన్ని గుర్తించిన కారులో ఉన్న వ్యక్తులు కారును రోడ్డు పక్కన నిలిపి కిందకు దిగారు. కారులో నుంచి మంటలు వ్యాపించడంతో నిమిషాల వ్యవధిలోనే కారు పూర్తిగా దగ్ధమైంది.

పట్టాలపై మృత్యుఘంటికలు

రైల్వేట్రాక్‌లపై పెరుగుతున్న ప్రమాదాలు

- పట్టాలు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్న వైనం
- సెల్ఫీలు, రీల్స్ మాయలో పడి మృత్యువాత
- ఎంఎంటీఎస్, సబర్బన్ మార్గాల్లోనే ఎక్కువ



ప్రమాదాలు ఇలా..

సంవత్సరం	ప్రమాదాలు	ఆత్మహత్యలు	అనుమానాస్పద మృతి
2024	735	631	206
2025 (ఇప్పటికి)	214	189	57

- 2021లో 408 మంది ప్రమాదాలు బారిన పడగా, 2024 నాటికి ఆ సంఖ్య 735 కు చేరింది.

సాక్షి, సిటీబ్యూరో: పట్టాలు మృత్యు ఘంటికలు మోగిస్తున్నాయి. పట్టాలు దాటుతూ రైళ్లు ఢీకొని కొందరు, బలవన్మరణాలకు పాల్పడుతూ మరికొందరు పట్టాలపైనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఏటా పెరుగుతున్న ప్రమాదాల సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. ట్రాక్‌లకు రెండు వైపులా సరైన రక్షణ వ్యవస్థలు, కంచెలు లేకపోవడం వల్ల ప్రజలు యథేచ్ఛగా పట్టాలు దాటేస్తున్నారు. మరో వైపు ట్రైన్ తమను చేరే లోపు ట్రాక్ దాటేయొచ్చనే అతివిశ్వాసం కూడా నిండు ప్రాణాలను హరిస్తోంది. నగరంలోని ఎంఎంటీఎస్, సబర్బన్ ప్రాంతాల్లోనే అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎంఎంటీఎస్ రైళ్లు రాకపోకలు సాగించే ట్రాక్‌లకు రెండు వైపులా కాలనీలు, బస్తీలు ఉన్నాయి. రాత్రింబవళ్లు ఈ ట్రాక్‌లను దాటుతూ ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దక్షిణమధ్య రైల్వేలోని జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు, అధికారుల అంచనాల ప్రకారం ఈ ఏడాది ఇప్పటి వరకు సుమారు 450 ప్రమాదాలు నమోదయ్యాయి. ప్రతి రోజు సగటున మూడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. నిజానికి రైల్వే భద్రతా చట్టాల ప్రకారం పట్టాలు దాటడం నేరం. కానీ నగరంలోని వివిధ ప్రాంతాల్లో కాలనీలు, నివాస సముదాయాలకు సరైన రోడ్డు రవాణా సదుపాయాలు, పట్టాలు దాటవలసిన చోట ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వంటి ఏర్పాట్లు లేకపోవడం వల్ల గత్యంతరం లేని పరిస్థితుల్లోనే పట్టాలు దాటాల్సి వస్తోందని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.''పట్టాలను దాటుతూ ప్రమాదాల బారినపడాలని ఎవరూ కోరుకోవడం లేదు. కానీ ఇవి తమ దైనందిన జీవితంలో భాగమయ్యాయి.'' అని డబీర్‌పూరా ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. ఒక్క డబీర్‌పురా, ఉప్పుగూడ, మలక్‌పేట్, చాంద్రాయణగుట్ట వంటి ప్రాంతాలే కాదు. లింగంపల్లి నుంచి ఫలక్‌నుమా వరకు, నాంపల్లి నుంచి లింగంపల్లి వరకు, మేడ్చల్, మల్కాజిగిరి, చర్లపల్లి, ఉందానగర్, బీహెచ్ఈఎల్, సికింద్రాబాద్ వంటి అనేక చోట్ల పట్టాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

మలుపులు...మృత్యు పిలుపులు

''లింగంపల్లి నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే క్రమంలో నేచర్‌క్యూర్ హాస్పిటల్, భరత్‌నగర్, హఫీజ్‌పేట్, తదితర చోట్ల ట్రాక్ మలుపులు ఉన్నాయి. ఈ రూట్‌లో ట్రైన్ దగ్గరకు వచ్చే వరకు గుర్తించడం కష్టం. ట్రైన్ వచ్చేలోపు దాటేయవచ్చునని భావిస్తారు. ట్రైన్ శబ్దాన్ని విని చాలా దూరంగా ఉందనుకుంటారు. కానీ కేవలం 10 సెకన్ల వ్యవధిలోనే అది వందల మీటర్ల దూరం పరుగులు తీస్తుంది.'' అని దక్షిణ మధ్య రైల్వే అధికారి ఒకరు చెప్పారు. ఈ మలుపుల వద్దనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మరోవైపు ఆత్మహత్యలకు పాల్పడేందుకు ట్రాక్‌లను ఆశ్రయిస్తున్నారు. దూసుకొచ్చే రైళ్లకు ఎదురెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారు.'' ట్రైన్‌కు ఎదురుగా మనిషి ఉన్నట్లు గుర్తించి బ్రేక్ అప్లయ్ చేస్తాం, కానీ అది కనీసం కిలోమీటర్ దూరంలో ఆగుతుంది. అప్పటికే ఆ వ్యక్తిని రైలు ఢీకొంటుంది.'' అని ఎంఎంటీఎస్ లోకోపైలెట్ ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో 189 మంది ఇలా ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

సోషల్ మీడియా మేనియా....

సామాజిక మాధ్యమాల పిచ్చి కూడా నిండుప్రాణాలను బలి తీసుకుంటోంది. ట్రాక్‌లపైన నించొని రకరకాల రీల్స్ చేస్తున్నారు. రైళ్లకు ఎదురెళుతూ వీడియోలు తీసి ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టా వంటి వేదికల్లో తమ సాహసకృత్యాలను ప్రదర్శించుకుంటున్నారు. ముఖ్యంగా టీనేజ్ యువత ఇలాంటి సోషల్ మీడియా మేనియాలో పడి ప్రాణాలను కోల్పోతున్నారు. ఇటీవల ఓ యువకుడు సనత్‌నగర్ వద్ద పరుగులు తీస్తున్న ఎంఎంటీఎస్ పక్కన నించొని ఫొటోలు, వీడియోలు తీసుకొనేందుకు ప్రయత్నించి రైలు ఢీకొనడంతో చనిపోయాడు. ఫుట్‌బోర్డుపైన నిలుచుని గాలిలో ఊగుతూ వీడియోలు తీస్తూ దుస్సాహసాలకు పాల్పడుతున్నారు. ''తాము పట్టాల పక్కనే నించున్నాం. ప్రమాదం లేదనుకుంటారు. కానీ ట్రైన్ వెడల్పును అంచనా వేయలేరు.అలా ఢీకొని చాలా ప్రమాదాలు జరిగాయి.'' అని ఆర్పీఎఫ్ సిబ్బంది ఒకరు తెలిపారు.